డబ్బు రాజకీయాలను ఓడించండి

- జనాల కోసం పనిచేసే నాయకున్ని గెలిపించండి
- సిపిఎం పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం, రాష్ట్రాల్లోనూ ఏ ప్రభుత్వాలు ఏర్పడిన ఆ ప్రభుత్వాల మెడలు వంచి ప్రజలకు ఉపయోగపడే చట్టాలను చట్టసభల్లో అమలు చేయించి ప్రజలకు అందించిన ఘనత సిపిఎందేనని ఆపార్టీ పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నేలపట్ల, అగ్రహారం, మునిగేపల్లి, గోపాల్‌రావు పేట, జీళ్ళచెరువు, కేశవాపురం, చేగొమ్మ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు కేంద్రంలో యుపిఎ-1 సర్కార్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని, సమాచార హక్కు చట్టాన్ని, చట్టసభల్లో ఆమోదింప చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీలదే, ముఖ్యంగా సిపిఎం పార్టీదేనని అన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడి.. గిరిజనులు, అడవి బిడ్డల పోడు భూములకు హక్కుపత్రాలను అందేటట్లు చేశామని తెలిపారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో పేరుతో రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ యాత్రలు నిర్వహించి ఎస్‌సి సబ్ ప్లాన్‌ను తీసుకొచ్చేలా చేశామన్నారు. ఈ రోజు ప్రతి ఎస్‌సి కాలనీల్లో సీసీ రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేశారంటే అది సబ్‌ప్లాన్ ఫలితమేనని గుర్తు చేశారు. సీతారామ ప్రాజెక్టుతో గోదావరి జలాలను పాలేరు జలాశయంలో కలుపుతామని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం.. ఆనాడు తాను చేసిన దుమ్ముగూడెం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం చేసిన పాదయాత్ర ఫలితమేనని వెల్లడించారు.

నేడు పాలేరులో పోటీ చేస్తున్నటువంటి నాయకుల చరిత్ర చూసి ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. రూ. వేలకోట్ల కాంట్రాక్టు పనులు చేస్తూ అందులో అవినీతికి పాటుపడుతూ, అక్రమ సంపాదించిన డబ్బుతో ప్రజలను అంగడి సరుకులా కొనుగోలు చేసి ఓట్లు వేయించుకుందామని చూస్తున్న బిఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డబ్బు సంచులు పట్టుకొని ఏ పార్టీ అధికారంలోకొస్తే ఆ పార్టీలోకి వెళుతూ ఊసరవెల్లిగా రంగులు మారుతున్న నాయకులను ప్రజలు తిరస్కరించాలన్నారు. జన సమస్యల కోసం, ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల కోసం పోరాటం చేస్తూ ప్రజల మధ్యలో ఉన్నటువంటి సిపిఎం అభ్యర్థినైనా తనను ప్రజలు ఆదరించి, ఆలోచించి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైరా సిపిఎం అభ్యర్థి భూక్య వీరభద్రం, సిపిఎం పాలేరు డివిజన్ ఇన్‌చార్జి బండి రమేష్, మండల ఇన్‌చార్జి బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎర్రబోయిన భారతి, మండల కమిటీ సభ్యులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న తమ్మినేని

బిజెపి మ్యానిఫెస్టో ఎన్నికల జిమ్మిక్కు

రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విడుదల చేసిన బిజెపి మ్యానిఫెస్టో ఎన్నికల జిమ్మిక్కుగా ఉందని సిపిఎం రాష్ట్ర కమిటి విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వలేదని పేర్కొన్నారు. విభజన చట్టాన్ని అమలు చేయలేదని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అమిత్‌షా ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో అమలు కావడం లేదని గుర్తుచేశారు. తెలంగాణలో అమలు చేస్తామని ప్రకటించడం ప్రజలను మోసగించడమేనని తెలిపారు.

ఈ మ్యానిఫెస్టో ప్రజల్లో చీలికతేవడంతో పాటు, సంక్షేమ పథకాలకు కోతకోసేదిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు దీన్ని గమనించి ఈ ఎన్నికల్లో మతోన్మాద, ప్రజా వ్యతిరేక బిజెపినీ, దాని మిత్రపక్షాలను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. 2014లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కేంద్ర బిజెపి ప్రకటించి, వాటికి ఎగనామం పెట్టిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న లక్షలాది ఖాళీలు నింపకుండా, ఇక్కడ ఉద్యోగాల భర్తీ చేస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉండి ద్రవ్యోల్బణాన్ని అరికట్టే అవకాశం ఉన్నప్పటికీ అరికట్టలేని బిజెపి, రాష్ట్రంలో ఎలా అరికడుతుందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జాలాలను పంపిణీ చేయకుండా ప్రాజెక్టులను ఆపిందని తెలిపారు. వ్యవసాయ రంగాన్నీ, వ్యవసాయ మార్కెట్లను కార్పొరేటీకరించాలని నాలుగు నల్లచట్టాలను తెచ్చిందని పేర్కొన్నారు. 23 వ్యవసాయ ఉత్పత్తులకు మాత్రమే అశాస్త్రీయ మద్దతు ధర నిర్ణయించి కార్పొరేట్ వ్యాపారులకు లక్షల కోట్ల లాభాలు ఆర్జించి పెడుతున్నదన్నారు. కానీ నేడు తెలంగాణలో వ్యవసాయానికి ఎరువులు, సబ్సిడీలు, ధాన్యానికి మద్దతు ధరలు అమలుచేస్తామని ప్రకటించడం హాస్యాస్పదని తెలిపారు. ఎఫ్‌సిఐ ద్వారా దాన్య సేకరణ చేయకుండా తెలంగాణ రైతాంగాన్ని ముంచి, ఇప్పుడు రాష్ట్రంలో క్వింటాల్‌కు రూ.3,100 ఇస్తామని చెబుతున్నదని తెలిపారు. కేంద్రంలో పదేండ్ల నుంచి అధికారంలో ఉన్న బిజెపి రూ.3,100లు మద్దతు ధరను ఎందుకు నిర్ణయించలేదు?అని ప్రశ్నించారు. గత ఎన్నికల సందర్భంగా ప్రకటించిన పసుపుబోర్డు ప్రకటన శిలాఫలకాలకే పరిమితమైందని గుర్తుచేశారు. దాన్ని టర్మరిక్ సిటీ చేస్తామంటే ప్రజలు నమ్మేస్థితిలో లేరని పేర్కొన్నారు. పార్లమెంటులో చిన్న సవరణ చేస్తే అమల్లోకి వచ్చే ఎస్‌టి వర్గీకరణకు, ఇప్పుడు మళ్లీ కమిటీ వేస్తామనడం ఎన్నికల జిమ్మిక్కేనని విమర్శించారు. మైనారిటీలకు అమలవుతున్న రిజర్వేషన్లు ఎత్తివేస్తామంటే ఇది ప్రజల్లో చీలికకు ఉపయోగపడేదేతప్ప మరొకటి కాదని తెలిపారు. మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ, విద్యారంగంలో జ్యోతిష్యాన్ని, కర్మకాండ లాంటి పాఠ్యాంశాలను చేర్చి దేశ నాగరికతను వేల సంవత్సరాలు వెనక్కు తీసుకెళ్ళే విధానాలను అనుసరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని బిజెపి ప్రకటించిన మోసపూరితమైన మ్యానిఫెస్టో తెలంగాణ అభివృద్ధికి ఏమాత్రం దోహదపడదని తెలిపారు.

నోట్ల కట్టలకు ఆశపడితే భవిష్యత్ నాశనమే

- అమీన్‌పూర్ బహిరంగ సభలో బివి రాఘవులు, చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎర్రజెండాకు వేసే ప్రతి ఓటూ పాలకుల గుండెల్లో పేలే తూటా లాంటిదని, ప్రజల సమస్యలపై పోరాడేందుకు మరింత శక్తిని పెంచేందుకు దోహదపడుతుందని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జె.మల్లిఖార్జున్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సంగారెడ్డి జిల్లాలోని బీరంగూడ మండే మార్కెట్‌లో నాయకులు నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ఆయన హాజరై మాట్లాడారు. పళ్లూడ గొట్టుకోవడానికి ఏ రాయి అయినా పర్వాలేదు అన్నట్లుగా ప్రజల గురించి ఆలోచించని ఏ పార్టీకి ఓటు వేసినా వృధానే అవుతుందన్నారు. కార్మిక వర్గం ప్రయోజనాలు తప్ప మరే ప్రయోజనాలు లేవని స్పష్టమైన రాజకీయ విధానాన్ని ప్రకటించే పార్టీ ఒక్క సిపిఎం మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు స్పష్టంచేశారు. ఈ విధానాన్ని చెప్పగల్గిన దమ్ము బిజెపి, కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిఎస్‌పిలకు ఉందా అని ప్రశ్నించారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో లక్షలాది మంది కార్మికుల పక్షాన సిపిఎం పోరాడిందన్నారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఇతర పార్టీల అభ్యర్థులు ఏనాడైనా కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని అడిగిన పాపాన పోలేదన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం కాలుష్య కుంపటిగా మారిందన్నారు. బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల చేసి భూములను కాజేయడం తప్ప అభివృద్ధి చేసిందిలేదని ఆరోపించారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, ఐద్వా రాష్ట్ర నాయకులు ఆశాలత, సిపిఎం అభ్యర్థి మల్లిఖార్జున్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య, బి.మల్లేశం, సాయిలు, రామచంద్రం, నాయకులు పాండురంగారెడ్డి, వాజీద్ అలీ, జార్జ్, అనంతకుమార్, శాంతకుమార్, రాజు, బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల ఉద్యోగోన్నతులపై విచారణ కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇటీవల చేపట్టిన ప్రొఫెసర్ల ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ప్రభుత్వానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం టీచర్స్ అసోసియేషన్ (ఔటా) ఈ నెల 10న ఫిర్యాదు చేయడంతో ఉన్నత విద్యామండలి స్పందించి విచారణ కమిటీని నియమించింది. తగినన్ని పిహెచ్‌డిలు లేకపోయినా, అంతర్జాతీయ జర్నళ్లలో పరిశోధన పత్రాలు ప్రచురితం కాకపోయినా కొందరు ప్రొఫెసర్లు ఉద్యోగోన్నతులు పొందారంటూ సంఘం ప్రతినిధులు ఆరోపించారు.సీనియర్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతులు ఇవ్వాలంటే ప్రొఫెసర్లకు పదేళ్ల సర్వీసు, 2పిహెచ్‌డిలు ఉండాలి. యుజిసి -కేర్‌లో 10 పరిశోధన పత్రాలు ప్రచురితమై ఉండాలి. 42 మంది ప్రొఫెసర్లకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు లభించగా.. వారిలో కొందరికి అర్హతలు లేవని ఔటా పేర్కొంది. విశ్వవిద్యాలయంలోని ఓ ప్రొఫెసర్.. 10 పరిశోధన పత్రాలు సమర్పించానని నివేదికలో రాసుకున్నారు. ఇందులో నాలుగు పత్రాలు లేవు. ఒక పరిశోధన పత్రం కాపీరైట్ వివాదంలో ఉన్నా ఉద్యోగోన్నతి కల్పించారు.డీన్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ పది పరిశోధన పత్రాలు సమర్పించానంటూ నివేదికలో రాసుకున్నారు. ఇందులో తొమ్మిది పత్రాలు యుజిసి-కేర్ జర్నళ్లలో లేవు. తనది కాని ఒక పరిశోధన పత్రాన్ని తన పేరు మీద రాసుకున్నారని ఆరోపణ. ఒక ప్రొఫెసర్ 25 పరిశోధన పత్రాలను సమర్పించారు. అవి యుజిసి-కేర్ జర్నళ్లలోనూ ప్రచురితమయ్యాయి. వాటిలో మూడు పరిశోధన పత్రాలే పనికొస్తాయంటూ ఒయు అధికారులు ఉద్యోగోన్నతి ఇవ్వలేదు. డీన్‌గా వ్యవహరిస్తున్న ఓ ప్రొఫెసర్ 2010 నుంచి పరిశోధన విద్యార్థులకు గైడ్‌గా వ్యహరిస్తున్నారు. ఇతర ప్రొఫెసర్ల నుంచి కొందరు విద్యార్థులను బదిలీ చేయించుకుని నెల రోజుల్లో వారికి పిహెచ్‌డిలు వచ్చేలా చేసి.. ఉద్యోగోన్నతి పొందారు.ఉద్యోగోన్నతుల కల్పనలో కొందరు అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ ఆరోపించారు. కొందరు అర్హులకు సీనియర్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతులు ఇవ్వలేదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. ఉన్నత విద్యామండలి విచారణ కమిటీని నియమించిందని తెలిపారు.

తక్కువ వడ్డీకి మహిళలకు రుణాలు

- తల్లి నుంచి చాలా నేర్చుకున్నా...
- మహిళలు మానసికంగా బలవంతులు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ ప్రజా జీవితంలో ఉండడం వల్ల చిన్నతనంలో ఆయన ప్రభావం తనపై తక్కువగా ఉండేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. తమ తల్లిని చూసి చాలా నేర్చుకున్నామన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో ఆదివారం మహిళలతో నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తమ కుటుంబం గురించి కెటిఆర్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన సతీమణి చాలా ఓపికగా ఉంటారని చెప్పారు. తన చెల్లి చాలా డైనమిక్ అని.. కుటుంబంలో ఆమె అంత ధైర్యవంతులు లేరన్నారు. తన కుమార్తె చిన్నవయసులోనే చాలా బాగా ఆలోచిస్తోందన్నారు. పిల్లలిద్దరినీ సమానంగా చూస్తానని చెప్పారు. బిఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు చాలా తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామని కెటిఆర్ చెప్పారు. డీప్‌ఫేక్ మహిళలకు మాత్రమే కాకుండా రాజకీయ నేతలకు సైతం ప్రమాదమేనని చెప్పారు. ప్రత్యర్థులు డీప్‌ఫేక్ వాడి తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తాను రష్మిక అంత ఫేమస్ కాదని ఈ సందర్భంగా ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో మహిళలకు సరైన సంఖ్యలో టికెట్లు ఇవ్వలేదని.. దీనిపై బాధగా ఉందన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ఎక్కువ మంది మహిళలే అని వివరించారు. మహిళలు మానసికంగా చాలా బలంగా ఉంటారని.. అది తాము నేర్చుకోవాలన్నారు. "ప్రతి ఇంటికీ మంచినీళ్లు అందించాం. మైనారిటీల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించాం. ప్రతి చిన్నారిపై రూ.10 వేలకుపైగా ఖర్చు చేస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 61 శాతానికి పెరిగాయి. శిశుమరణాలను తగ్గించాం. స్త్రీ నిధి కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నాం. ఎపి, తెలంగాణ మహిళలు స్త్రీ నిధి రుణాలు తీసుకుని 99 శాతం చెల్లిస్తున్నారు. ఆ రుణాలతో వాళ్లు వ్యాపారాలు ప్రారంభించి విజయం సాధిస్తున్నారు. మేం మేనిఫెస్టోలో మహిళల కోసం ప్రత్యేకంగా పెట్టిన కొన్ని పథకాలు పూర్తిచేశాం.. ఇంకా చేయాల్సినవి ఉన్నాయి. మహిళా యూనివర్సిటీ, కల్యాణలక్ష్మి, అమ్మఒడి వంటివి అందుబాటులోకి తీసుకొచ్చాం. నెగెటివ్ బ్లడ్ గ్రూప్ ఉన్న మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకురానున్నాం.

సుల్తాన్‌పూర్, నందిగామ సహా మొత్తం నాలుగుచోట్ల ప్రత్యేకంగా మహిళల కోసం ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేశాం. ప్రతిపక్షాలకు కూడా మేమే గెలుస్తామని తెలుసు.. కానీ వాళ్లు నటిస్తున్నారు" అని కెటిఆర్ వ్యాఖ్యానించారు. గచ్చిబౌలిలోని ఐటి కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు ఇంటికి ఆలస్యంగా వస్తున్నారని ఈ సందర్భంగా కెటిఆర్‌ను ఓ మహిళ ప్రశ్నించారు. ఉప్పల్ వైపు ఆ కంపెనీలు వస్తే తమ పిల్లలు త్వరగా ఇంటికి చేరుకుంటారని అభిప్రాయపడ్డారు. దీనిపై స్పందించిన కెటిఆర్.. రజనీకాంత్‌కు కూడా గచ్చిబౌలి నచ్చుతోందని సరదాగా వ్యాఖ్యానించారు. ఉప్పల్ వైపు ఐటి కంపెనీలు ఏర్పాటు చేసి ఉద్యోగులు త్వరగా ఇంటికి వచ్చేలా చేద్దామని చెప్పారు.

సంగీత నృత్య రసభరితం బాలల దినోత్సవం

ప్రజాశక్తి - కల్చరల్

దాదాపు మూడు వందల మందికిపైగా నృత్య, సంగీత, జానపద కళాకారులు రవీంద్ర భారతి ప్రధాన వేదికపై గజ్జల రవళి, రాగ ఆలాపనలతో ప్రేక్షకులను ముగ్ధులను చేశారు. మూడేళ్ల పిల్లల నుండి పన్నెండేళ్ళ బాలల వరకూ ఈ మెగా కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు. ఎబిసి ఫౌండేషన్ భారత్ ఆర్ట్స్ అకాడెమీ సంయుక్త నిర్వహణలో భారత్ బాలల దినోత్సవం పేరిట ఉదయం 9 నుంచి.సాయంత్రం 5 గంటల వరకూ ఎనిమిది గంటలపాటు నిరాటంకంగా సంగీత నృత్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథులుగా బిసి కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొలేటీ దామోదర్ పాల్గొని మాట్లాడారు. తెలుగు సంప్రదాయ కళలు ప్రపంచంలో అత్యంత ప్రాచీనమైనవని అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడెమీ నిరంతరం శాస్త్రీయ కళల వ్యాప్తికి వేదిక కల్పించి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు కె.వి.రమణారావు అధ్యక్షత వహించిన సభలో నాట్య గురువులు జ్యోతి కులకర్ణి, భార్గవి, ప్రియాంక, కృష్ణ, స్వప్నలత, సురేఖ, సంగీత గురువులు సంగీత సిస్టర్స్, జ్యోతిర్మయి, పూజిత తదితర గురువులను సత్కరించారు. వేదికపై కాంతి కష్ణ, రచయిత్రి శశిబాల, షేక్ అబ్దుల్ రెహమాన్, దీపిక, కుమార్‌సాను తమ అభినందనలు తెలుపగా.. భారత్ ఆర్ట్స్ అకాడెమీ అధ్యక్షురాలు లయన్ లలితారావు, ఎబిసి ఫౌండేషన్ అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు, రచయిత మారుతి వరుణ్, నాట్య గురువు మాగంటి వసుధ, మాగంటి విష్ణుతేజ తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

వీనులవిందుగా శోభన్ సినీ గాన లహరి

ప్రజాశక్తి - కల్చరల్

శోభన్ మ్యూజిక్ ఫీస్ట్ (ఎస్‌ఎంఎఫ్) సంస్థ నిర్వహణలో ఆర్‌టిసి క్రాస్ రోడ్ వద్ద ఉన్న సిటీ కల్చరల్ సెంటర్‌లోని కళా భారతి వేదికపై ఆదివారం తెలుగు హిందీ చిత్ర గీతాల గాన లహరి జరిగింది. ప్రముఖ గాయకులు రేణుక ఇందునయన, గిరిజ, లలిత, సత్య దీప్తి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, సంతోష్, డాక్టర్ రాజ్, శ్రీకాంత్, సంపత్, సుభాష్ చంద్ర తదితరులు తమ గానంతో శ్రోతల వీనుల విందు చేశారు. విఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీత దర్శకత్వంలో ప్రముఖ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం పాడిన మధుర యుగళ గీతాలను సంస్థ స్థాపకులు శోభన్‌బాబు, జ్యోతిర్మయిలు ఆలపించారు. మోహన్‌గాంధీ వ్యాఖ్యానం సందర్భ శుద్ధిగా ఉంది. ఈ సందర్భంగా సినీ దర్శకుడు రామ్ అబ్బరాజు సంస్థ లోగోను ఆవిష్కరించి శోభన్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

నోరి రఘురామమూర్తి నాటికల సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - కల్చరల్

శ్రీ త్యాగరాయ గానసభలోని కళా లలిత కళావేదికపై కల్యాణి కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో ప్రముఖ కవి, గాయకుడు నోరి రఘురామమూర్తి రచించిన పురుషుల దినోత్సవం, డోంట్ వర్రీ బీ హ్యాపీ రెండు నాటికల సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం జరిగింది. ప్రముఖ జర్నలిస్ట్ సూర్య ప్రకాశరావు సభకు అధ్యక్షత వహించి సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. రఘు రామమూర్తి వివిధ సాహితీ ప్రక్రియల రచనలో ప్రతిభావంతుడని, గతంలో అరుదైన కవితా ప్రక్రియ గజల్స్‌ను రాశారని గుర్తు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణకు రఘురామమూర్తి సంపుటిని అంకితం ఇచ్చారు. సంపుటిని సమీక్షించిన మంజుల సూర్య నాటికలు రెండూ ప్రదర్శన యోగ్యంగా, సంభాషణలు శక్తి వంతంగా ఉన్నాయని వివరించారు. రచయితలు ఘంట మనోహర్ రెడ్డి, డాక్టర్ రాధా కుసుమ తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి తొలుత రఘు రామమూర్తి, హేమ కల్యాణి, వల్లి కుమారి, సాయి కుమార్ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. హేమకల్యాణి నిర్వహణలో కవి సమ్మేళనంలో పది మందికిపైగా స్వీయ కవితలు చదివారు.

ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరుకు అన్యాయం

- రెండు నదులు ఉన్నా అందని సాగునీరు
- పాలమూరు గోస చూసి ఉద్యమం మొదలుపెట్టాం
- ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నేను తెలంగాణ ఏర్పాటు కోసం ఉద్యమం ప్రారంభించిన మొదటి దశలో అలంపూర్ వచ్చాను. ఇక్కడ కూతవేటు దూరంలో కృష్ణా, తుంగభద్ర నదులు ఉన్నా సాగునీరు లేక భూములు బీడ్లుగా మారాయి. ఉపాధి లేక దుబాయి, ముంబాయి వంటి ప్రాంతాలకు వలస పోయేవారు. ఆరిగోసల విముక్తికి ఏకైక మార్గం ప్రత్యేక రాష్ట్రమేనని తలచి జోగులాంబ నుంచి ఆర్‌డిఎస్ వరకు పాదయాత్ర చేశాను. అప్పుడే ఈ ప్రాంతానికి తెలంగాణ రాష్ట్రం ద్వారానే సాగునీరు అందుతుందని ఆనాడే చెప్పానని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. ఆదివారం అలంపూర్, కొల్లాపూర్, నాగర్ కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఫ్యాక్షనిజం, గుండాయిజానికి తావు లేదన్నారు. ప్రజలు వజ్రాయుధమైన ఓటును దుర్వినియోగం చేసుకోరాదని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో దోపిడీ, రైతాంగ సమస్యలు, పాలమూరు వలసలు, సాగునీటి వంటి సమస్యలను ఏ పార్టీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలకు అతి సమీపంలో కృష్ణ, తుంగభద్ర నదులు ఉన్నప్పటికీ సాగు తాగునీరు నోచుకోకపోవడం పాలకుల వైఫల్యమే అని గుర్తు చేశారు. తొమ్మిదేండ్ల క్రితం తెలంగాణ ప్రాంత దుస్థితిని ఆ తర్వాత జరిగిన అభివృద్ధిని ఒకసారి పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. 55 ఏండ్ల గోసల తర్వాత వచ్చిన తెలంగాణలో ప్రాజెక్టులను పూర్తిచేసుకుని.. సాగు, తాగునీరు కల్పించిన ఘన చరిత్ర బిఆర్‌ఎస్‌కు ఉందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాల వల్లే తెలంగాణలోని బోయలు బిసిలుగా ఉన్నారని, ఈ సారి ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బోయలను ఎస్‌టిలో చేర్చుతానని హామీ ఇచ్చారు. ఆర్‌డిఎస్ దుస్థితి వల్లనే తుమ్మిలను పూర్తి చేసి 35,000 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ పూర్తి చేయడమే గాక చిన్నోనిపెల్లి ఎత్తిపోతలను పూర్తి చేశామన్నారు. అలంపూర్‌లో 100 పడకల ఆస్పత్రితో పాటు ఇతర పనులను మిషన్ కాకతీయ ద్వారా పూర్తి చేసుకుందామన్నారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో అమలు చేయలేని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ధరణి తొలగిస్తే రైతుబంధు వంటి అనేక పథకాలు రైతుల ఖాతాలో ఎలా జమ చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి పథకాలు సంపూర్ణంగా అమలు కావాలంటే మరోసారి బిఆర్‌ఎస్ గెలవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి నిరంజన్ రెడ్డి, ఎంపి రాములు, అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బీరం హర్షవర్ధన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి జనార్దన్ రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్ యాదవ్, నాయకులు జక్క రఘునందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

110 స్థానాల్లో బిజెపికి డిపాజిట్ గల్లంతు

- అధికారంలోకి రాగానే సచివాలయంలో ప్రజాదర్బార్
- నక్సలైట్ల ఎజెండా అమలు చేసింది కాంగ్రెస్సే
- టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల్లో బిజెపికి 110 సీట్లలో డిపాజిట్లు రావు. బిసి వ్యక్తిని సిఎంను ఎలా చేస్తుందని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 10 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉంటే.. ఒకరు మాత్రమే ఒబిసి సిఎం ఉన్నారని గుర్తు చేశారు. బిసి గణన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నా...ఆ పార్టీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. బిసి గణన చేయలేని పార్టీ బిసి సిఎంను ఎలా చేస్తుందని నిలదీశారు. బలహీన వర్గాలు కెసిఆర్‌ను ఓడించాలన్న కసితో ఉన్నాయన్నారు. ఆ ఓట్లను చీల్చి కెసిఆర్‌కు సహకరించడమే బిజెపి వ్యూహమని విమర్శించారు. ఎన్నికల కోసమే బిజెపి ఎస్‌సి వర్గీకరణ హామీ ఇస్తుందని చెప్పారు. ఎస్‌సి వర్గీకరణపై గతంలో వెంకయ్య నాయుడు సభ నిర్వహించి 100 రోజుల్లో చేస్తామన్నారు. ఇప్పటికీ అతీగతీ లేదన్నారు. బిల్లు పెడితే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నా... బిజెపి ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. దళితుల ఓట్లు కాంగ్రెస్‌కు రాకుండా చీల్చేందుకే కమిటీతో కాలయాపన అని ఆరోపించారు. దమ్ముంటే పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మోడీని కలిసేందుకు అఖిల పక్షాన్ని తీసుకెళ్లాలని కోరారు. నక్సలైట్ల ఎజెండా ను కాంగ్రెస్ అమలు చేసిందనీ, ఆ తర్వాతనే నక్సలిజం తగ్గిందని గుర్తు చేశారు. పేదలకు భూమి పంచింది కాంగ్రెస్ పార్టీయేన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సచివాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ధరణి పేరుతో పెద్ద ఎత్తున భూదోపిడీ జరిగిందని రేవంత్ ఆరోపించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న లక్ష ఎకరాల నిజాం వారసుల భూములు చేతులు మారాయని విమర్శించారు. అందుకే ధరణి రద్దు చేస్తామంటే కెసిఆర్‌కు దు:ఖం వస్తుందన్నారు. భూ యజమానికి, కౌలు రైతులకు, రైతు కూలీలకు అందరికీ ఆర్థిక సాయమందిస్తామన్నారు. ఇందులో గందరగోళం ఏమీ లేదన్నారు. బిఆర్‌ఎస్ గందరగోళం సృష్టించాలని చూస్తోందని విమర్శించారు. సంకీర్ణం చర్చే లేదు రాష్ట్రంలో సంకీర్ణం అనే చర్చే లేదని రేవంత్ అన్నారు. ఈ విషయంలో ఎవరికీ అనుమానం అక్కర్లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి 80-85 సీట్లు వస్తాయన్నారు. కెసిఆర్ అధికారంలోకి వచ్చాక రేషనలైజేషన్ పేరుతో 12 వేల పాఠశాలలు మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. యుపిఎస్‌సి తరహాలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. అధికారంలోకి రాగానే రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీనిచ్చారు.

కెసిఆర్ ఉద్యమకారుడు కాదు

సిఎం ఉద్యమకారుడు కాదనీ, ఫక్తు రాజకీయ నాయకుడని, ఆయనకు రావాల్సిన దానికంటే ఎక్కువే వచ్చాయని రేవంత్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యమకారుల కుటుంబాలను గుర్తించి ఆదుకుంటామన్నారు. స్వాతంత్ర్య సమరయోధులతో సమానంగా తెలంగాణ ఉద్యమకారులను గౌరవిస్తామన్నారు. అధికారంలోకి రాగానే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఆదాయాన్ని పెంచడం పేదలకు పంచడం కాంగ్రెస్ విధానమని చెప్పారు. ప్రగతిభవన్‌ను డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భవన్‌గా మారుస్తామని తెలిపారు. సిఎం ఎవరనేదానిపై పార్టీ అధిష్టానం నిర్ణయమే తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, సాధిక్, కె శ్రీనివాసరావు, మధు తదితరులు ఉన్నారు.

ఎన్నికల వేళ.. ఆతిథ్య మేళా..!

- జోరుగా చుక్క, ముక్క పంపిణీ
- ఓటర్లను మచ్చిక చేసుకునే యత్నాలు
- మేడ్చల్, జవహర్‌నగర్‌లో కేసులు నమోదు
- అన్నీ అధికార 'పార్టీ'లే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో అధికార బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఎన్నికల కోడ్ వచ్చే వరకు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, సంక్షేమ పథకాల పంపిణీతో బిజీగా మారిన అధికార పార్టీ అభ్యర్థులు తాజాగా ఓటర్లను ఆకర్షించే పనిలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్, బిజెపి సైతం ఇదే పనిలో పడ్డాయి. ఉదయం వేళ ఇతర పార్టీల కార్యకర్తలకు వారి పార్టీ కండువాలు కప్పడం.. మధ్యాహ్నం బూత్, గ్రామ, మండల స్థాయి కమిటీలతో సమావేశాలు నిర్వహించడం.. ఎన్నికల్లో విజయం కోసం సమాలోచనలు చేయడం, సాయంత్రం అనుచరుల నివాసాలు, ఆఫీసులు, కన్వెన్షన్ సెంటర్లు, ఫాం హౌస్‌ల్లో గెట్ టు గెదర్ పార్టీల్లో మునిగి తేలుతున్నారు. కాలనీ, అపార్టుమెంట్, గెటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు. వివిధ రకాల మాంసాహార వంటకాలతోపాటు ఖరీదైన మద్యం బాటిళ్లను సరఫరా చేస్తున్నారు. ఒకవైపు అభ్యర్థి గెలుపునకు ఏ విధంగా కృషి చేయాలనే అంశంపై చర్చిస్తూనే.. మరోవైపు సుక్కు ముక్కతో ఎంజాయ్ చేస్తున్నారు. ముఖ్యంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ నియోజకవర్గంలో ఈ దావత్‌లు ఎక్కువగా జరుగుతున్నట్టు సమాచారం. ఇటీవలే మేడ్చల్, జవహర్‌నగర్‌లలో పలువురిపై కేసులు కూడా నమోదయ్యాయి.

మామిడి తోటలో మందు పార్టీ..

మేడ్చల్ నియోజకవర్గంలోని జనవహర్‌నగర్‌లో ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి మామిడి తోటలో మందు పార్టీ నిర్వహించారు. జవహర్‌నగర్‌లోని లక్ష్మీనరసింహ కాలనీ సమీపంలోని ఓ ఫామ్‌హౌస్ (మామిడితోట)లో స్థానిక కార్పొరేటర్లు, ఓ పార్టీ నాయకులు వందలాది మంది ఈ విందు పార్టీకి హాజరయ్యారు. ఎన్నికల సమయంలో ఓ పార్టీ నాయకులు ప్రజలకు డబ్బు, విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆరోపణలు కూడా వచ్చాయి. మామిడి తోటలో మందు పార్టీ జరుగుతుందని సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పలు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల అధికారుల సూచనల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకూ మందు పార్టీ..

ఎన్నికల విధులు నిర్వహించే ఉపాధ్యాయులకూ ఓ రాజకీయ పార్టీ మందు, విందు ఏర్పాటు చేసింది. ఓ ఉపాధ్యాయ సంఘానికి చెందిన నేతలను తమ వైపు తిప్పుకోవడానికి ఆ పార్టీ గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని కండ్లకోయ నిమ్మల గార్డెన్‌లో సాయంత్రం మందు, విందు ఏర్పాటు చేసింది. పోలింగ్ రోజు బూత్‌కు చేరుకునే వృద్ధుల ఓట్లను తమ పార్టీకి వేయించుకోవాలన్నదే ఈ పార్టీ ముఖ్య ఉద్దేశం. ఓటు వేయడానికి వచ్చే వృద్ధులకు సహాయంగా కుటుంబ సభ్యులను బూత్ వరకు అనుమతిస్తారు. లోపలికి మాత్రం రానివ్వరు. ఓటు వేయడంలో వృద్ధులకు పోలింగ్ సిబ్బంది సహకరిస్తారు. ఆ సమయంలో తమ పార్టీకి ఓటు పడేలా చేసేందుకు ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులను మందు, విందుతో సదురు రాజకీయ పార్టీ ఖుషీ చేసింది. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన నాయకులు ఎంత జాగ్రత్త వహించినా సాధ్యం కాలేదు. మందు కిక్కులో కొందరు పార్టీ దృశ్యాలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు పార్టీ చేసుకోవడంపై సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు సోదాలు చేశారు.

పేరుకు యూనియన్ సమావేశం

కండ్లకోయలోని నిమ్మల గార్డెన్‌లో చేసుకున్న పార్టీని యూనియన్ సమావేశంగా కొందరు చిత్రీకరించారు. యూనియన్ వేడుకల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులు యూనియన్‌లో చేరిన వారిని సన్మానించి మందు పార్టీ చేసుకున్నట్టు నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ పార్టీలో అగ్ర నాయకులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొనడంతో ఖచ్చితంగా ఎన్నికల పార్టీయే అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

వైన్స్‌లతో ఒప్పందాలు

ఎన్నికల్లో మద్యం పంపిణీని నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ గట్టి చర్యలే చేపట్టింది. గెట్ టు గెదర్ పార్టీలకు నేరుగా మద్యం సరఫరా చేస్తే పోలీసులు పట్టుకునే అవకాశం ఉండడంతో అభ్యర్థులు ఎవ్వరికీ అనుమానం రాకుండా తమ అనుచరులు, బంధువులు, బినామీల పేరుతో ఉన్న వైన్స్‌లతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. అభ్యర్థి వెంట రోజంతా తిరిగిన ముఖ్య నాయకులతోపాటు ఇతర నిర్వాహకులకు సాయంత్రం వేళ మందు పార్టీ అరేంజ్ చేస్తున్నారు.

జహీరాబాద్ చరిత్రలో..
మొదటిసారి బరిలో 22 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జహీరాబాద్ చరిత్రలో శాసనసభ ఎన్నికల్లో 22 మంది అభ్యర్థులు పోటీ చేయడం చర్చినీయాంశంగా మారింది. ప్రధాన పార్టీల అభ్యర్థులకు స్వతంత్ర అభ్యర్థులు దడ పుట్టిస్తున్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు తమకు అనుకూలమైన వారిని విత్‌డ్రా చేయించేందుకు శాయశక్తుల్లా ప్రయత్నాలు చేశారు. బుజ్జగింపుల్లో సమయం దాటిపోవడంతో ఇద్దరు అభ్యర్థులు విత్‌డ్రా కోసం వెళ్లి కూడా వెనుదిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. నామినేషన్ల అనంతరం ప్రధాన పార్టీల నాయకులు తమను బుజ్జగిస్తారని ఆలోచించే ఎక్కువ మంది నామినేషన్లు వేసినట్టు తెలిసింది. తమ బలం ఏంటో ప్రజల మధ్య తేల్చుకుంటామని స్వతంత్ర అభ్యర్థులు చెబుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులను బుజ్జగించడానికి బదులు ప్రధాన పార్టీలు తమ మేనిఫెస్టోలను, పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. మరో ప్రయత్నంగా స్వతంత్ర అభ్యర్థుల ఓట్లను తమకు అనుకూలంగా మల్చుకునే విధంగా వ్యూహాలు పన్నుతున్నారు. ఓట్ల చీలికతో తమ ఓటు బ్యాంకును పదిలపర్చుకుంటే గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్‌లో టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉంది. ఈసారి ఎన్నికల్లో చక్కెర పరిశ్రమ, నిమ్జ్ బాధితులు ప్రధాన ఎన్నికల ఎజెండాగా మారనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. జహీరాబాద్ ఎత్తైన ప్రాంతంలో ఉండడంతో ఇక్కడ చెరకు ప్రధాన పంటగా పండిస్తారు. నియోజకవర్గంలో 5 వేల నుంచి పదివేల వరకు చిన్న, సన్నకారు చెరుకు రైతులు ఉన్నారు. చక్కెర పరిశ్రమ క్రషింగ్ ప్రారంభం అవ్వకపోతే అధికార పార్టీపై ప్రభావం పడుతుందని నాయకులు ఆలోచిస్తున్నారు. రైతులను, పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులను మచ్చిక చేసుకునేందుకు పలు దఫాలుగా పర్యటనలు, ప్రచారాలు కూడా నిర్వహించిన విషయం తెలిసిందే. జహీరాబాద్ నియోజకవర్గంలో చివరివరకు ఎంతమంది అభ్యర్థులు ప్రచారం చేస్తారో, ఎంతమంది ఎవరికి మద్దతిస్తారో, ప్రచారం నిర్వహించకుండా మిన్నకుండిపోతారో వేచి చూడాలి మరి..

30న హైకోర్టు సెలవు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈనెల 30న హైకోర్టుకు సెలవు ప్రకటిస్తూ శనివారం రిజిస్టర్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టుతోపాటు జ్యుడీషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, లీగల్ సర్వీసెస్ కమిటీ, మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ సెంటర్‌కు ఈ సెలవు వర్తిస్తుందని చెప్పారు. ఈ సెలవు నేపథ్యంలో డిసెంబర్ 16 (శనివారం)ను పనిదినంగా ప్రకటించారు. న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టుల సిబ్బందికి సమాచారం కోసం ప్రకటన విడుదల చేసినట్లు వెల్లడించారు.

గూగుల్ మ్యాప్‌లో పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. పోలింగ్ కేంద్రాలను, ఓటర్ల వివరాలను తెలుసుకునే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సరళతరం చేసింది. తన పోర్టల్‌లో పోలింగ్ బూత్‌ల వారీగా సమగ్ర అంశాలను అందుబాటులోకి తెచ్చింది. వెబ్‌సైట్‌లోకి వెళ్లి సాధారణ ఎన్నికలు-2023 ఎలక్టోరల్ రోల్స్‌లో జిల్లా పేరు, అసెంబ్లీ నియోజకవర్గం ఎంపిక చేసుకోవాలి. దీంతో ఏ నియోజకవర్గంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయో తెలిపే వివరాలు తెరపై ప్రత్యక్షమవుతాయి. దాని చెంతనే తెలుగు, ఆంగ్ల భాషల్లో గూగుల్ మ్యాప్‌ని నిక్షిప్తం చేశారు. అందులో ఓటరు ప్రారంభ సంఖ్య, చివరి సంఖ్య, పురుషులు, మహిళలు ఎంత మంది ఉన్నారు.... ఇలా బూత్‌ల వారీగా వివరాలు అందుబాటులో ఉంచారు.

ప్రచార సభలో మాట్లాడుతున్న నర్సింహారావు

ఇబ్రహీంపట్నంలో ఎర్రజెండా ఎగురవేస్తాం

- నియోజకవర్గంలో భూములు పంచిన చరిత్ర సిపిఎందే..
- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వం తమదని, ఈ సారి ఎన్నికల్లో ఇబ్రహీంపట్నంలో తప్పకుండా ఎర్రజెండా ఎగురవేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహరావు అన్నారు. ఇబ్రహీంపట్నం సిపిఎం అభ్యర్థి పగడాల యాదయ్య మంచాల మండలంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని తిప్పాయిగూడ, చిత్తాపూర్, తాళ్ళపల్లిగూడ, లింగంపల్లి గ్రామాల్లో పార్టీ ప్రచారం కొనసాగింది. ఈ ప్రచారానికి డీజీ హాజరై మాట్లాడారు. ఇబ్రహీంపట్నం పోరాట వారసత్వం కలిగిన ప్రాంతమని, ఇక్కడ ఎర్రజెండా ఆధ్వర్యంలో వేల ఎకరాల భూమి పంపిణీ చేసినట్టు గుర్తు చేశారు. అంతేగాక సిపిఎం ఎమ్మెల్యేలుగా పనిచేసిన కొండిగారి రాములు, మస్కు నర్సింహ.. అనేక అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. 15 ఏండ్లుగా అసెంబ్లీలో సిపిఎం ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఈ ప్రాంతం పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో వినిపించే వారే కరువయ్యారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం సిపిఎంతోనే సాధ్యమని తెలిపారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటేసి తమ పార్టీ అభ్యర్థి పగడాల యాదయ్యను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సిపిఎం అభ్యర్థి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పూర్తిగా విఫలం అయ్యారన్నారు. ఆయనే మళ్లీ మరోసారి అవకాశం కోరడం విడ్డూరంగా ఉందన్నారు. తమకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగిల్ల శ్యామ్ సుందర్, జిల్లా నాయకులు కర్నాటి శ్రీనివాస్‌రెడ్డి, గొరెంకల నర్సింహ, కందుకూరి జగన్, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌తో బిజెపి మిలాఖత్

- అందుకే బిజెపికి రాజీనామా : విజయశాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీ మారారంటూ తనపై వస్తున్న విమర్శలను సినీనటి, మాజీ ఎంపి విజయ శాంతి ఖం డించారు. బిజెపిని వీడి కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో ఎక్స్(ట్విటర్) వేదికగా వివరించారు. "రాములమ్మ పార్టీ మారారు అని విమర్శించే వాళ్ళు ఒకటి తెలుసుకోవాలి. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏడు సంవత్సరాలు జెండా మోసి కొట్లాడింది నేను. నాడు బండి సంజయ్, కిషన్‌రెడ్డి మరికొందరు బిజెపి ప్రముఖులు అనేకసార్లు నా వద్దకు వచ్చి బిఆర్ఎస్ అవినీతిపై తప్పక చర్యలుంటాయని చెప్పారు. మీరందరూ సమర్థిస్తే కేంద్రంలోని బిజెపి ఎంతవరకైనా కొట్లాడతది అని చెప్పి నన్ను, వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఒప్పించారు. అందుకు కేంద్ర పెద్దలతో హామీ ఇప్పించి చేర్చుకున్నది నిజం కాదా? రాష్ట్రంలోని దుర్మార్గ పాలన పోవాలి.. మేము కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ బాగుంటే చాలు అన్న ఒకే ఒక్క కారణంతో.. సంవత్సరాలుగా పనిచేసిన కాంగ్రెస్‌ను వదిలి బిజెపిలోకి వెళ్లాం. మాట నిలబెట్టుకోక.. మమ్మల్ని మోసగించి, బిఆర్ఎస్‌తో బిజెపి అవగాహన పెట్టుకున్నది తెలిసి కదా ఇంతమంది నాయకులు రాజీనామాలు చేసి బయటకెళ్లింది? విమర్శలు తేలిక.. ఆత్మ పరిశీలన అవసరం" అని విజయశాంతి ట్వీట్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

బిఆర్ఎస్, బిజెపి , ఎంఐఎం లోపాయికారీ పొత్తు

- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో ఎన్నికల బరిలోకి దిగి ప్రజలను మోసం చేస్తున్నాయని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషాతో కలిసి హైదరాబాద్‌లో ఆదివారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి గోషామహల్ అభ్యర్థి రాజాసింగ్‌పై పోటీ పెట్టకుండా, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ మైనార్టీ అభ్యర్థిపైన ఎంఐఎం బరిలో దిగడం మూడు పార్టీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టమవుతుందని విమర్శించారు. పదేళ్లుగా అధికారంలో కొనసాగుతున్న బిజెపి, బిఆర్ఎస్‌లకు గ్యాస్ ధరలు ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు.. యువతను, విద్యార్థులను మోసం చేసేందుకు తప్పుడు మేనిఫెస్టోలను ప్రకటించారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేయకపోగా, ఉన్న సంస్థలను విక్రయించి, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా చేసిందని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం పోటీ పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయిందని దుయ్యబట్టారు. శాసనసభ ఎన్నికల్లో డిపాజిట్లను కూడా తెచ్చుకోలేని బిజెపి బిసిని ఎలా ముఖ్యమంత్రిని చేస్తుందని ప్రశ్నించారు. బిసి సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌ని పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించిందని గుర్తు చేశారు. లిక్కర్ కేసులో కవితను కాపాడేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీ చేస్తున్న కొత్తగూడెం శాసనసభ నియోజకర్గంలో ఒక ఇండిపెండెంట్ వ్యక్తికి వామపక్ష పార్టీగా చెప్పుకునే ఫార్వర్డ్ బ్లాక్ బీ ఫామ్ ఎలా ఇస్తుందని నారాయణ ప్రశ్నించారు. సిపిఐ మాజీ ఎంపి అజీజ్ పాషా మాట్లాడుతూ యుపి, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్న ఎంఐఎం, తెలంగాణ సొంత రాష్ట్రంలో కేవలం 9 సీట్లలోనే ఎందుకు పోటీ చేస్తుందని నిలదీశారు.. రాష్ట్ర వ్యాప్తంగా 40 శాసనసభ నియోజకర్గాల్లో ముస్లింల ప్రభావం ఉంటుందని, ఈసారి ఎంఐఎం తీరుపై ఆలోచించి ఓటు వేయాలని వారికి సూచించారు. తెలంగాణలో కర్నాటక తరహా మార్పులు వస్తాయని అజీజ్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్, నర్సింహ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న కూనంనేని

కొత్తగూడెంలో అభివృద్ధి కుంటుపడింది

- నన్ను గెలిపించండి.. అండగా ఉంటా
- సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి తప్ప, ఈ పదేండ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని కొత్తగూడెం నియోజకవర్గ సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామంలో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ప్రజల పక్షాన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని, ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న కొంతమంది నాయకులు తాము అభివృద్ధి చేశామంటే తాము అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటూ ప్రజలను మాయబుచ్చేందుకు తిరుగుతున్నారని విమర్శించారు. ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్, సిపిఐ కూటమికి ప్రజలు పట్టం కట్టబోతున్నారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రత్యేక గ్రాంట్ల ద్వారా నిధులను తీసుకొస్తే, తాజా, మాజీ ప్రతినిధులు వాటి నిధులను మళ్లించి అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. ఐదేండ్ల పాటు ప్రజలను, వారి కష్టాలను పట్టించుకోని నాయకులు డబ్బు మూటలతో వస్తున్నారని వారి ఆటలు కొనసాగకుండా ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఐ, టిడిపి, జన సమితి నాయకులు కోత్వాల శ్రీనివాస్ రావు, జానకి రెడ్డి, ఎర్రం శెట్టి ముత్తయ్య పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే సబ్‌ప్లాన్ చట్టం

- చట్టాలు, పథకాల నిర్వీర్యానికి ప్రభుత్వం యత్నం
- నికరంగా పోరాడుతున్న కెవిపిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర జనాభాలో 15.45 శాతం ఎస్‌సిలున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వీరు అట్టడుగున ఉన్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులను మాత్రమే కేటాయించేది. ఆ నిధులను కూడా దళితుల అభ్యున్నతికి ఖర్చు పెట్టేది కాదు. దీంతో వారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండేది. ఈ నేపథ్యంలో సిపిఎం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘంతో పాటు మేధావులు, ఇతర 102 సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడి సబ్‌ప్లాన్ చట్టం కోసం నిర్విరామ పోరాటాలు చేశాయి. బివి రాఘవులు, జాన్‌వెస్లీ తదితరులు నిరవధిక దీక్షలకు పూనుకున్నారు. పోరాటాల ఉధృతికి తలవంచిన ప్రభుత్వం..సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ చట్టం ద్వారా బడ్జెట్‌లో షెడ్యూల్ కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి వారి అభివృద్ధి కోసం ఖర్చు చేసే వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటయింది.ఎస్సీ అభివృద్ధి నిధికి కేటాయించిన నిదులు సుమారు 54 శాఖల ద్వారా ఖర్చు చేసే యంత్రాంగం ఉండేది. ఈ ఏడాది ఖర్చు చేయని నిధులను మరుసటి సంవత్సరం ఖర్చు చేసే విధంగా క్యారీ ఫారవడ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా నాడు ప్రభుత్వం ప్రకటించింది. పోరాటం ఫలితంగా సాధించిన గొప్ప విజయమిది. అయితే కేసీఆర్ ప్రభుత్వం దళితుల అభివృద్ధి గురించి గొప్పలకు పోతున్నది. వారికోసం కేటాయించిన నిధులను మాత్రం ఖర్చు చేయకుండా చట్ట విరుద్ధంగా దారి మళ్లిస్తున్నది. 2014నుంచి 2022-23 (సెప్టెంబర్ 30 వరకు) మధ్యకాలంలో ఎస్సీల అభివృద్ధి నిధి కింద రూ. 1,41,160.37 కోట్లు కేటాయించగా రూ.77,978.27కోట్లు అంటే 55శాతం మాత్రమే ఖర్చు చేసింది. సుమారు రూ.63,182.10 కోట్లు దారి మళ్లాయి.

పెరుగుతున్న దాడులు..

గత తొమ్మిదేండ్ల కాలంలో రాష్ట్రంలో దళితులపై దాడులు దౌర్జన్యాలు పెరిగాయి. 86 కుల దురహంకార హత్యలు జరిగాయంటే పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంబోజ్ నరేశ్, పెరుమాండ్ల ప్రణయ్, మంథని మధుకర్ ఇలా అనేక మంది కుల దరహంకారంతో అతి ధారుణంగా హత్యగావించబడ్డారు. ఈ హత్యలకు వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నికరంగా పోరాడింది. ఐక్య పోరాటాల్లో ముందు పీఠిన నిలబడింది. పోరాటాల ఫలితంగానే దోషులపై చట్టబద్ద చర్యలు తీసుకున్నారు. బిజెపి, బీఆర్ఎస్ దోషులను కాపాడేందుకు ప్రయత్నించాయి. వీడీసీల పేరుతో నిజామాబాద్ జిల్లాలో దళితులను గ్రామ బహిష్కరణకు గురిచేస్తే దానికి వ్యతిరేకంగా కేవీపీఎస్ పోరాటాలు నిర్వహించింది. సంబంధిత వ్యక్తులపై చట్టబద్ద చర్యలు తీసుకునేలా వత్తిడి చేసింది.

దళితబంధులో అవినీతి..

దళిత బంధుపథకం ఎమ్మెల్యేలకు వరంలా మారింది. దీంతో లబ్దిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయమై 282 మండలాల్లో ధర్నాలు, ఆందోళనలు జరిగాయి. దీంతో అవినీతిని అరికట్టేందుకు ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొస్తున్నట్టు ప్రకటించినప్పటికీ రాజకీయ జోక్యం తొలగిపోలేదు.దీనిపై కెవిపిఎస్ నికరంగా పోరాడుతుంది.

మూలకు పడ్డ మూడెకరాల భూమి..

కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగావ నిర్వహించిన పోరాటాల ఫలితంగా భూమి లేని ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి నినాదాన్ని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చేర్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత 6,242 కుటుంబాలకు 15,571 ఎకరాలు పంపిణీచేసి సర్కార్ చేతులెత్తేసింది.

బిఆర్ఎస్‌లో చేరిన బాబూమోహన్ తనయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి పి.బాబుమోహన్‌కు భారీ షాక్ తగిలింది. ఆయన తనయుడు ఉదయ్ తన అనుచరులతో కలిసి బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు బిజెపి అందోల్ మండలాధ్యక్షులు నవీన్‌కుమార్, ఉమ్మడి పుల్కల్ మండలాధ్యక్షులు శేఖర్‌గౌడ్, జోగిపేట పట్టణాధ్యక్షులు సయ్య సాయి, బిజెవైఎం నాయకులు రవికిరణ్, సాయికుమార్, ఎస్‌సి మోర్చా నాయకులు రాకేష్, నాయకులు లక్ష్మణ్, అర్జున్, రాములు, లడ్డు తదితరులు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలోని మంత్రి హరీశ్‌రావు నివాసంలో బిఆర్ఎస్‌లో చేరారు. బిజెపి నేత, మాజీ జడ్‌పి చైర్‌పర్సన్ బాలయ్య తన అనుచరులతో ఇదివరకే బిఆర్ఎస్‌లో చేరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బిజెపిలో నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. దాంతో అందోల్‌లో బిజెపికి గడ్డు పరిస్థితి ఏర్పడింది. అందోల్ బిజెపి టికెట్‌ను ఉదయ్ ఆశించగా.. ఆయన తండ్రి బాబుమోహన్‌కు టికెట్ కట్టబెట్టడంతో పార్టీ మారినట్టు తెలుస్తోంది. బాబుమోహన్ వైఖరితోనే పార్టీ ఖాళీ అవుతున్నదని గుసగుసలు వినబడుతున్నాయి. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ బలోపేతానికి తామంతా కృషి చేస్తామని, అందోల్‌తోపాటు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రానున్నదన్నారు. మూడోసారి కెసిఆర్ సిఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్ మఠం బిక్షపతి, పార్టీ సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, కాశీనాథ్ తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

బిఆర్ఎస్ ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం

- తొలగించిన 26 కులాలను బిసి జాబితాలో చేర్చాలి
- ఎనిమిది రోజుల్లో వైఖరి ప్రకటించాలి
- లేదంటే ఆ పార్టీని ఓడిస్తాం.. : ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర బిసి జాబితా నుంచి 26 కులాలను తొలగించి బిసిలను అన్ని విధాలా బిఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 26 బిసి కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ తొలగించిన వెనుకబడిన 26 కులాలను 8 రోజుల్లోపు బిసి జాబితాలో కలపాలని సిఎం కెసిఆర్‌ను డిమాండ్ చేశారు. ఇప్పటికే విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో ఎంతో నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లితండ్రులు బిసిలుగా ఉంటె పిల్లలు ఒసిలు ఎలా అవుతారని అయన ప్రశ్నించారు. బిసిలను విభజించి అధికారంలోకి వస్తామంటే బిసిలు ఊరుకోబోరని హెచ్చరించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతివ్వాలనే విషయం నాలుగు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. డిసెంబర్ 13, 14న జరగనున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో బిసి కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ధర్నా చేపట్టనున్నట్టు ప్రకటించారు. విలేకర్ల సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీలం వెంకటేష్ ముదిరాజ్, సుధాకర్, రాజేందర్, అనంతయ్య, పితాని ప్రసాద్ , బిల్ల దీపిక తదితరులు పాల్గొన్నారు.